# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా వీబీజీ-రామ్-జీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పేర్కొన్నారు.

- డేటా ఆధారిత నిర్ణయాలకే భవిష్యత్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- పేదరిక నిర్మూలనకు వీబీజీ-రామ్-జీ పథకం దోహదపడుతుందని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు.

- వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాల వద్ద అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) [వీబీజీ-రామ్-జీ] చట్టం 2025 పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి వీబీ జీ-రామ్-జీ పథకాన్ని తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ముక్కవారిపల్లి గ్రామంలో ఈ రోజు ఆయన ప్రారంభించారు. ముక్కవారిపల్లి గ్రామంలో 4 లక్షల 55 వేల రూపాయల వ్యయంతో ప్రతిపాదించిన మూడు అభివృద్ధి పనులను కూడా లాంఛనంగా ప్రారంభించారు. అదే విధంగా వర్షపు సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ-రామ్-జీ మిషన్ కింద చేపట్టారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... రానున్న 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ కి కేంద్రం నుంచి 7 వేల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని అన్నారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి 422 కోట్ల రూపాయల నిధులు ఇవ్వనున్నట్టుగా ప్రకటించారు. అలాగే 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని శివరాజ్ సింగ్ చౌహన్ తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రంగా రాయలసీమ నిలుస్తోందన్నారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

========================

ప్రజలకు ప్రభుత్వం సేవలు అందించడం ఎంత ముఖ్యమో సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడం కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్‌పై తిరుపతిలో నిర్వహిస్తోన్న రెండు రోజుల వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డేటాయే సంపదగా మారుతున్న రోజులు వచ్చాయన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలకే భవిష్యత్ ఉంటుందని చెప్పారు. డేటా లేక్ ద్వారా అన్ని శాఖల సమాచారం అనుసంధానం చేస్తున్నామన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా సంజీవని ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ రూపొందించామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

గ్రామీణ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు వికసిత్ భారత్ జీ-రామ్-జీ పథకం ఉపయోగపడుతుందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. వీబీ జీ-రామ్-జీ పథకాన్ని తిరుపతి జిల్లా ముక్కవారిపల్లెలో ఈరోజు ప్రారంభించిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఉపాధి శ్రామికులకు అదనంగా 25 రోజులు భరోసా కల్పించడం ఈ పథకంలో ముఖ్యమైందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. శ్రామికుల కొరత రాకుండా వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు విరామం రైతులకు ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలుకు మొత్తం 12 వేల 845 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లుగా ఆయన వివరించారు. గత రెండేళ్లలో పల్లె పండుగ వంటి కార్యక్రమాల ద్వారా 16 వేల 695 కోట్ల రూపాయలు ఉపాధి నిధులు వినియోగించామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

విరామం

========================

టెక్స్ టైల్ రంగం ఉపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. మహిళా సాధికారతకు గార్మెంట్స్ పరిశ్రమలు బలమైన వేదికగా నిలుస్తున్నాయని అన్నారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో రాయలసీమ జిల్లాల పరిధిలోని జౌళి, హస్తకళా శాఖలకు చెందిన అధికారులతో కేంద్రమంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వస్త్ర, జౌళి రంగాభివృద్ధికి కేంద్రం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను టెక్స్‌టైల్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు.

========================

రాష్ట్రంలో గత రెండేళ్లలో న్యాయ శాఖలో విస్తృతంగా సంస్కరణలు అమలు చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డీ. ఫరూక్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 216 కోట్ల రూపాయలతో కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతులు ఇచ్చామన్నారు. అదే విధంగా ఈ-కోర్ట్స్ ప్రాజెక్ట్, కోర్టు నిర్వహణ, హైకోర్టు బలోపేతం కోసం మొత్తం 305 కొత్త పోస్టులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా మైనారిటీ వర్గాలకు విస్తృత స్థాయిలో ప్రయోజనం చేకూరిందన్నారు.

========================

కవి డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన 'దృష్టి' సాహిత్య వ్యాసాల పుస్తకావిష్కరణ విశాఖపట్నంలో ఈ రోజు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ... దృష్టి పుస్తకం చాలా మందికి ఉపయోగపడుతుందని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

========================

రాష్ట్రంలో పవర్ గ్రిడ్ విస్తరణకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుర్రా వంశీ రామ మోహన్ ని ఢిల్లీలో ఆయన ఈరోజు కలిశారు. కొత్త ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు.

========================

శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం ఉన్న 2,358 పోలింగ్ కేంద్రాలకు అదనంగా కొత్తగా మరో 107 కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఈరోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ జాబితా ప్రక్రియ జిల్లాలో నిరంతరాయంగా సాగుతోందని చెప్పారు. జులై 21న ముసాయిదా ప్రచురణ అనంతరం ఆగష్టు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, తుది జాబితాను సెప్టెంబర్ 22న ప్రకటిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

========================

వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాల వద్ద అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మీ తెలియచేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

విశాఖ జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అన్ని అంశాల్లో నిర్దేశిత గడువులోగా చర్యలు పూర్తి చేసి.. ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై ఆయన సమీక్షించారు. జిల్లాలో కొనసాగుతున్న రైల్వే, జాతీయ రహదారులు, జీవీఎంసీ, పర్యాటక శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

========================
========================